ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

## పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -302 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 16 ఫిబ్రవరి 2026

# హరహర మహాదేవ

### తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

#### భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయాలు -తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు

**శ్రీశైలం, ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. మిగతా 2లో...



# పాక్‌ను పడగొట్టారు

#### పాక్‌పై 61 పరుగులతో భారత్ గెలుపు
#### అర్ధ సెంచరీతో మెరిసిన ఇషాన్ కిషన్
#### బుమ్రా, హార్దిక్, అక్షర్, వరుణ్ మ్యాజిక్
#### భారత్ 175/7, పాకిస్తాన్ 114/10

కొలంబో **ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించింది. గ్రూప్-ఏలో కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో పాక్‌పై 61 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్.. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సూపర్‌ఎయిట్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇషాన్ కిషన్ (77, 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సులు) ధనాధన్ అర్ధ సెంచరీతో చెలరేగటంతో తొలుత భారత్ 175/7 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (32, 29 బంతుల్లో 3 ఫోర్లు), మిగతా 6లో...



# రైతులకు ద్రోహమే

#### వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తుంది
#### ఇది అన్నదాతల భవిష్యత్తుకు సంబంధించిన విషయం
#### కేంద్రం తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం
#### అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ప్రధానికి ఐదు ప్రశ్నలు



న్యూఢిల్లీ : **ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కండ్లారా చూస్తున్నామనీ, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదనీ, రైతుల భవిష్యత్తుకు సంబంధించిందన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. "డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ (డీడీజీ) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసిన (జీఎం) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై మిగతా 2లో...

# శక్తితోనే సాధించాం!



### వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు

#### పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ
#### స్క్రిప్టు ప్రకారమే ఇంటర్వ్యూ: కాంగ్రెస్

న్యూఢిల్లీ, **ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. మిగతా 2లో...



# హంగ్ కోసం కాంగ్రెస్ అరాచకం

#### కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
#### 34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు
#### కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తూ, ప్రలోభాలకు గురిచేస్తోందని కేటీఆర్ ఆరోపణ
#### సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు

# పార్టీ కోసం శ్రమించే వారే ముఖ్యం




#### జనసేనకు భారీ విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్
#### శివరాత్రి పర్వదినాన జనసేనకు శుభారంభం
#### పార్టీకి రూ.2 కోట్ల విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్
#### పార్టీ కోసం శ్రమించే వారే తమకు ముఖ్యమని ప్రకటన

**అమరావతి, ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
శివరాత్రి పండుగ రోజు జనసేన పార్టీకి మరో శుభారంభం అయింది. పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్వయంగా తొలి సభ్యత్వం తీసుకుని మిగతా 2లో...

## 'గేట్స్' సహకారంలో ఏపీలో
# డిజిటల్ హెల్త్
## నేడు బిల్ గేట్స్ పర్యటన

#### సామాన్యుడి చెంతకు అంతర్జాతీయ వైద్యసేవలు
#### ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా 'సంజీవని'
#### రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు
#### మరింత సహకారం కోరనున్న సీఎం చంద్రబాబు
#### ప్రజారోగ్యంపైనే ఫోకస్

**అమరావతి, ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
ఆరోగ్య రంగంలో సాంకేతిక విప్లవం ద్వారా సామాన్యులకు మెరుగైన, సత్వర వైద్యసేవలందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలోని మిగతా 2లో...



## నేను పాలకుడిని కాదు..
# సేవకుడిని

#### అచ్చంపేటలో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రం 20 ఎకరాల్లో నిర్మాణం
#### మాకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారు
#### చదువుతోనే ధనవంతులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



# నేను పాలకుడిని కాదు.. సేవకుడిని

హైదరాబాద్ **ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుం టానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు మూడు మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేటలో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రం నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రం నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ముఖ్యమంత్రి రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు.

తన ప్రజా జీవితంలో జెడ్పీటీసీగా విజయం సాధించడం మొదలు ముఖ్యమంత్రిగా తాను కొనసాగుతున్న క్రమంలో 20 ఏండ్లలో లంబాడాలు తనకు అండగా నిలిచారని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ హయంలో ల్యాండ్ సీలింగ్‌ను తెచ్చి భూములను పంచారనీ, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం పంచేందుకు ప్రభుత్వం వద్ద భూములు లేవనీ, దేశాన్ని ఏలేందుకు ఏ చదువులు ఎంత చదువుకున్నా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సోషల్, ఎకనామిక్, క్యాస్ట్ సర్వేను ఆయన ప్రస్తావిస్తూ, గతంలో మాదిరిగా భూములుంటేనే ధనవంతులనే పరిస్థితి లేదని తెలిపారు. చదువుకుంటేనే ధనవంతులుగా మారుతున్నారని ఆ సర్వేలో గమనించినట్టు చెప్పారు. భూములు, తాత్కాలిక సంక్షేమం మరిచి బంజారాలు చదువుకోవాలని సీఎం సూచించారు. చదువే వారి భవిష్యత్తును మారుస్తుందని ఆయన తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడాల పాత్ర తీసివేయలేనిదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సురేష్ నాయక్, కవితా నాయక్ తదితరుల ఆత్మ బలిదానాలు చేశారని ఆయన ఉదహరించారు. వారికి సంక్షేమంలో, అభివృద్ధిలో, ప్రభుత్వ పాలనలో సముచిత భాగస్వామ్యం, గౌరవం దక్కాల్సి ఉందన్నారు. ప్రతి తండాకు బీటీ రోడ్లను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖ మంత్రినీ, ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అటవీ నిబంధనలు అడ్డుగా ఉన్న తండాల్లో విద్యుత్ సరఫరాకు సోలార్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అచ్చంపేటలో ప్రయోగాత్మకంగా 40 వేల పంప్ సెట్లకు సోలార్ విద్యుత్ ఇచ్చేందుకు ఎంపిక చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

గత ప్రభుత్వం 10 ఏండ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీంతో మార్కెట్‌లో గతంలో రూ.60 కేజీ ఉన్న సన్నబియ్యం ధర రూ.40కి పడిపోయిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఇండ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, స్వయం సహాయక సంఘాలను వెయ్యి బస్సులకు యజమానులను చేశామనీ, వెయ్యి మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును అప్పగించామనీ, హైటెక్ సిటీలో విలువైన భూమిని మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం కేటాయించామనీ, హాస్టల్ బాలికలకు కాస్మొటిక్స్ ఛార్జెస్‌ను 200 శాతం పెంచినట్టు తెలిపారు. గ్రూప్స్‌తో పాటు ప్రభుత్వం చేపట్టిన 70 వేల నియామకాల్లో 85 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

**మున్సిపల్ ఫలితాలు నా పనితనానికి గీటురాయి**

నేనే రాజు ఐ. నేనే మంత్రి అంటే కొంత మంది సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ శాఖ మంత్రిగా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటములకు తనదే బాధ్యత అని చెప్పినట్టు ముఖ్యమంత్రి వివరించారు. ఎన్నికలకు ముందు 12 ఏండ్లు కేంద్రంలో ఉన్న పార్టీ, పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ, రెండేండ్లుగా తమ పాలనను బేరీజు వేసుకుని ఓటు వేయాలని తాను కోరినట్టు ఆయన గుర్తుచేశారు. తాము పాలకులం కాదనీ, సేవలకులమని గతంలోనే తాను చెప్పిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి గుర్తుచేశారు. సేవకునిగానే బాధ్యతలు నిర్వహిస్తున్నాననీ, ఏ వర్గాలైతే తనకు అవకాశమిచ్చారో ఆ వర్గాలకు సేవ చేయాలన్నదే తన ప్రయత్నమని స్పష్టం చేశారు. జఠిలంగా మారిన ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాననీ, బుడగ జంగాలకు చెందిన పిల్లలకు ఎంబీబీఎస్‌లోనూ సీట్లు వచ్చాయని తెలిపారు. తాను చేసిన పని ఫలితాలను ఇస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం ఫలితాలు తమకు అనుకూలంగా వస్తే, అది జీర్ణించుకోలేక, అర్థం కాక, అర్థమైనా స్వీకరించే మనసు వారికి లేదని ఆయన విమర్శించారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేసిన వారిని ఆ దళితున్నే అధ్యక్షా అని మైక్ అడిగే పరిస్థితిని తెచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభాలో 15 శాతం ఉన్న ఎస్సీలకు ప్రభుత్వంలో 30 శాతం అవకాశం కల్పించినట్టు తెలిపారు. ప్రజలు ఆశీర్వదించినంత కాలం ఉంటాననీ, పరిణామ క్రమంలో ఇతరులు రావాల్సిందేనన్నారు. అప్పటి వరకు ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్నదే తన ఆలోచన అని తెలిపారు. ప్రజా తీర్పును తప్పుపట్టొద్దని ఆయన సూచించారు. గెలిస్తే ఉప్పొంగిపోవడం, ఓడిపోతే కుంగిపోవడం తనకు అలవాటు లేవన్నారు. 20 ఏండ్లలో ఎన్నో హోదాలు చూసిన తాను ఏనాడు ప్రజలకు దూరం కాలేదనీ, మరో 20 ఏండ్లు పేదల కోసమే పని చేస్తానని చెప్పారు. సంత్ సేవాలాల్ లంబాడాల కోసం చేసిన కృషిని ముఖ్యమంత్రి కొనియాడారు.

**సేవాలాల్ మార్గాన్ని అనుసరిస్తాం -మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

సేవాలాల్ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ విద్య, ఉపాధి, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వమే లక్ష్యంగా గిరిజన సమాజాన్ని అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గిరిజన సమాజంలో పెను మార్పులకు దోహదపడ్డ గొప్ప సంస్కర్త సేవాలాల్ బోధించిన సమానత్వం, సత్యం, శ్రమ, సామాజిక ఔన్నత్యం వంటి విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవని మంత్రి సూచించారు. సేవాలాల్ జయంతికి ఇస్తున్న నిధులను రూ.10 కోట్లకు పెంచాలని అభ్యర్థించారు. మొదట్నుంచి కాంగ్రెస్ పార్టీయే బంజారాల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్ నాయక్, ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడారు. పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శక్తితోనే సాధించాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**బలమైన స్థానంలో ఉండి బేరమాడాం**

అమెరికాతో ట్రేడ్ డీల్ విషయంలో ప్రతిపక్షాల విమర్శలను ప్రధాని తిప్పికొట్టారు. ట్రేడ్ డీల్స్ చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాసాలు నిర్వహించామని తెలిపారు. 'ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించటంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. దానివల్లే మేం బలమైన స్థితిలో ఉండి వాణిజ్య ఒప్పంద చర్చల్లో బేరసారాలు నిర్వహించగలిగాం. వస్త్రాలు, తోలు, కెమికల్స్, చేతివృత్తులు, రత్నాలు తదితర రంగాల్లో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు మరింత విస్తరించేలా ఎఫ్‌టీఏలను డిజైన్ చేశాం' అని ప్రధాని మోదీ వివరించారు.

దేశ అభివృద్ధిలో ఇకపై ప్రైవేటు రంగమే కీలకపాత్ర పోషించనుందని ప్రధాని తెలిపారు. ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం, అంతర్జాతీయ పోటీని తట్టుకొనే విషయాల్లో ప్రైవేటు రంగ సంస్థలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టడంపైనే వికసిత్ భారత్ తర్వాతి దశ ఆధారపడి ఉందని చెప్పారు. వికసిత్ భారత్ ఆవిష్కరణలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. 'వచ్చే పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు, శక్తిమంతమైన ఆవిష్కరణలు, పరిపాలనలో మరింత సరళత అనే మూడు లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం ఇస్తాం. స్థిరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగంలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టడం, మౌలిక వసతుల కల్పనను కొనసాగించటం, డిజిటల్ పరివర్తనలపైనే దేశ వృద్ధి ఆధారపడి ఉంది. ప్రాథమిక స్థాయి నుంచి సంస్కరణలు చేపట్టడం వల్లనే నేడు ప్రపంచానికి భారత్ డిజిటల్ లీడర్‌గా ఎదిగింది. డాటా సెంటర్లు యువతకు భారీగా ఉద్యోగాలు కల్పించగలవు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను మనదేశంలో డాటా సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఆహ్వానిస్తున్నాం. తర్వాతి తరం టెక్నాలజీ విప్లవానికి నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో కలిపి తాను గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వాధినేతగా ఉన్నానని మోదీ గుర్తు చేశారు. ఈ 25 ఏళ్లలో తాము రూపొందించిన ప్రతి బడ్జెట్ దేశాభివృద్ధిలో దేనికదే ప్రత్యేకమైనదని తెలిపారు. ఒక్కటి కూడా సాదాసీదా బడ్జెట్ కాదని పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా స్వల్పకాలిక లక్ష్యాలతో రూపొందించినది కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రూపొందించినదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మన రక్షణ రంగాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. అందులో భాగంగానే 2026-27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి నిధులు పెంచినట్లు చెప్పారు. కాగా, ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. చాలా జాగ్రత్తగా రూపొందించిన స్క్రిప్టు ప్రకారం ఇంటర్వ్యూ సాగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ప్రధాని పబ్లిసిటీ స్టంటులో ఇదో భాగమని ఎద్దేవా చేశారు.

## హరహర మహాదేవ



(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి.

మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్‌ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## 'గేట్స్' సహకారంలో ఏపీలో డిజిటల్ హెల్త్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యవ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేసింది. రాష్ట్రంలో విద్య,వైద్య, వ్యవసాయరంగాల్లో గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఇస్తున్నసహకారంతోపాటు టెక్నాలజీ పరంగా మరింత సహకారం అందించేక్రమంలో సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు నేడు గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఏపీ వస్తున్నారు. ఈసందర్భంగా ఆయన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అమలవుతున్న ఆధునిక పద్ధతులు, పాటించాల్సినవిధానాలపై ప్రభుత్వానికి కీలకసూచనలు చేయనున్నారు. ముఖ్యంగా జబ్బుల బారినపడిన వారికి వైద్యం అందించే సంప్రదాయ విధానానికి భిన్నంగా.. వ్యాధులు సోకడాన్ని ముందుగానే పసిగట్టి, వాటి నివారణా చర్యలతో పాటు ప్రజల ప్రస్తుత ఆరోగ్య స్థితిగతుల్ని వ్యక్తిగతంగా సమగ్రంగా పరీక్షించి, వారికి జబ్బులొచ్చే అవకాశాన్ని ముందుగానే హెచ్చరికలు చేయడం, వ్యక్తిగత హెల్త్ కార్డుల్ని రూపొందించడం, డిజిటల్ ఆరోగ్య సేవలు (టెలిమెడిసిన్) అందించే దిశగా వైద్య ఆరోగ్య వ్యవస్థను ప్రక్షళన చేయాలన్న అంశాలపై కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణకు ఉన్న విధానాలు, పద్ధతులను సమగ్రంగా సమీక్షించి ఆరోగ్యాంధ్ర సాధనకు చేపట్టాల్సిన విధానాలపై నివేదించేందుకు గేట్స్ ఫౌండేషన్ సూచనల మేరకు 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై సీఎం చంద్రబాబు బిల్‌గేట్స్‌కు వివరించనున్నారు. అంతేకాకుండా గేట్స్ ఫౌండేషన్ సూచించిన మేరకు వివిధ పథకాల అమలుకు భాగస్వామ్యుల ద్వారా కార్యాచరణను ప్రారంభించడంతో పాటు ఇంటిగ్రేటేడ్ విధానంలో సాంకేతిక సహకారంతో వివిధ ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో రియల్ టైమ్‌లో ప్రజల ఆరోగ్య భద్రత కోసమే ప్రత్యేకంగా సంజీవని పథకాన్ని ప్రారంభించింది. చిత్తూరు జిల్లా కుప్పంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేసి, ఇప్పుడు చిత్తూరు జిల్లాకు విస్తరించింది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. దీనికి గేట్స్ ఫౌండేషన్ సహకారం మరింత కావాలని ప్రభుత్వం కోరనుంది.

ఆపై ఆరోగ్యశాఖను ఆర్టీజీఎవీసలోని అవేర్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేసి వ్యాధులు ప్రబలటాన్ని ముందుగానే పసిగట్టే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. స్థూలంగా డేటా ఆధారిత ముందస్తు వ్యూహాలు, విధానాల రూపకల్పనకు గేట్స్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం తోడ్పడుతుంది. ఏఐ ఆధారిత డయగ్నోస్టిక్ పరీక్షలు, సంచార పరీక్షా కేంద్రాల్లో సులువుగా నిరంతరం వాడే పరికరాలు, దూర ప్రాంతాల్లో వైద్యం, టెలిమెడిసిన్‌కు సంబంధించిన ఉపకరించే పరికరాల ఎంపికకు గేట్స్ ఫౌండేషన్ టెక్నికల్ సపోర్టు అందిస్తుంది.

**వైద్య రంగంలో టెక్నాలజీ అవసరం: సత్యకుమార్**

వైద్య రంగంలో ఆశించిన మార్పులను సాధించడానికి, వైద్యం అందరికీ సులువుగా అందించడానికి టెక్నాలజీ సహకారం ఎంతో అవసరం. ఈ దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇందులో భాగంగాఏఐ ఆధారిత జాతీయ విధాన రూపకల్పన దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విజయవాడలో వివిధ రాష్ట్రాలతో మొదటి విడత చర్చల జరిపాం. ఆరోగ్యశాఖకు టెక్నాలజీ అనుసంధానంపై ఫౌండేషన్ సహకారం తీసుకుంటాం.

## పార్టీ కోసం శ్రమించే వారే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకి రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే వారిని "ఉద్యమి"గా గౌరవిస్తామని తెలిపారు.పార్టీ పోరాటానికి బలం చేకూర్చి, నవతరంలో ప్రేరణ కలిగించే వారిని "సాధక్"గా, పరోక్షంగా సమయం, ఆర్థికం, సాంకేతికం, సేవా, మేధో సహకారాలు అందించే వారిని "ప్రదాత"గా ఇకపై పిలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు.జనసేన పార్టీ ప్రారంభంలో 150 మందితో మొదలైందని, 2021లో మొదటి విడత సభ్యత్వంలో 90 వేలు నమోదు అయ్యాయని పవన్ తెలిపారు. గత ఎన్నికల ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరిందని... ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. చిన్న వ్యాపారులు, కూలీలు, చదువుకున్నవారు అందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడిచేవారే ముఖ్యమని పవన్ కల్యాణ్ అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేసినవారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది

## రైతులకు ద్రోహమే

(మొదటి పేజీ తరువాయి)

ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా? ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా?" అని రాహుల్ గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

## హంగ్ కోసం కాంగ్రెస్ అరాచకం

### కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

**ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు.



ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు. ఎవరు కలిసినా, కలవకపోయినా సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తేల్చిచెప్పారు.

గతంలో తమ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వేలాది మంది గిరిజన యువతకు రాజకీయ అవకాశాలు కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల భూ హక్కులను కాపాడామని తెలిపారు.

ప్రజా రిపబ్లిక్

సోమవారం 16 ఫిబ్రవరి 2026

# చిప్పగిరిలో ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్





**చిప్పగిరి, ఫిబ్రవరి, 15, (రిపబ్లిక్ న్యూస్)** మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండల కేంద్రమైన చిప్పగిరిలో చిప్పగిరి యూత్, గ్రౌండ్ బాయ్స్ ఆధ్వర్యంలో మరియు సీనియర్స్ సహకారంతో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఈనెల 10వ తేదీన ప్రారంభించారు. ఈ టోర్నీలో మండల స్థాయిలో మొత్తం 15 టీంలు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో కుందన్ గుర్తి గ్రామానికి చెందిన కేడివై హిటర్స్ మరియు చిప్పగిరికి చెందిన నాకౌట్ లెవన్స్ టీంలు తలపడ్డాయి. హోరా హోరీగా జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్లో నాకోట్ లెవెల్స్ విజయం సాధించింది. మొదటి బహుమతి స్పాన్సర్లు విజయ విఠల పాఠశాల కరస్పాండెంట్స్ యూసఫ్, చంద్రమోహన్ చేతులమీదుగా నాకోట్ లెవెల్స్ టీంకు కెప్టెన్ సురేష్ రెడ్డి కి రూ. 10,000 రూపాయలు బహుమతిగా మరియు అర్జున్ చికెన్ షాప్ కొండా పెద్దన్న, కొండా అర్జున్ ల చేతిలో మీదుగా కేడివై హీటర్స్ టీం కెప్టెన్ విజయ్ కు రూ. 5,000 రూపాయలను బహుమతులుగా అందజేశారు. అనంతరం ఆర్గనైజర్లు మొదటి బహుమతి,రెండో బహుమతి కి స్పాన్సర్లకు శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని,అంతేకాకుండా క్రీడలు ఒక వ్యాయామం వంటివిని క్రీడలు ఆడడం వల్ల మనిషి ఆరోగ్యంవంతమైన జీవనాన్ని గడపవచ్చని తెలిపారు.

# బంటనహాళ్ గ్రామానికి సచివాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**చిప్పగిరి, ఫిబ్రవరి, 15, (రిపబ్లిక్ న్యూస్)** బంటన హాల్ గ్రామ ప్రజలు తమ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ/వార్డ్ సచివాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి కి వినతి పత్రం అందజేశారు,ప్రస్తుతం గ్రామ ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ఏరూరు కు సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, గర్భిణీలు, వికలాంగులు, విద్యార్థులు మరియు రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణ ఖర్చు మరియు సమయం ఎక్కువవుతోందని గ్రామస్తులు తెలిపారు,సుమారు నాలుగు వేల జనాభా కలిగిన బంటనహాళ్ గ్రామం చిప్పగిరి మండల పరిధిలో ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోనే గ్రామ/వార్డ్ సచివాల ఏర్పాటు చేయడం అత్యవసరమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు,గ్రామంలో సచివాలయం ఏర్పాటు అయితే పింఛన్లు, రేషన్, ఆదాయజాతి ధృవపత్రాలు,నివాస ధృవపత్రాలు, రైతు సేవలు మరియు ఇతర ప్రభుత్వ పథకాల సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

# అన్నదాన ట్రస్ట్ కు పెద్దిరెడ్డి కవితమ్మ సోదరి కల్పనా రెడ్డి లక్ష రూపాయలు విరాళం..

**అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తాదులకు స్వయంగా వడ్డించిన - పెద్దిరెడ్డి కవితమ్మ**







**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 14 - (రిపబ్లిక్ న్యూస్) -** మదనపల్లి :- తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారక నాథ్ రెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ ఆదివారం మహాశివరాత్రిని పురస్కరించుకొని తంబళ్లపల్లి మండల కేంద్రమైన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారిని పెద్ద ఎత్తున మహిళలతో తరలి వెళ్లి దర్శించుకున్నారు. ఆలయ గౌరవ మర్యాదలతో ఆమెను ఆలయ పూజారులు పూర్ణకుంభాలతో స్వాగతించారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శనం గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకుని వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పూజారులు ఆశీర్వచనం చేశారు. అమ్మవారి వస్త్రాలను అందించారు. అనంతరం కొండ కింద భాగాన పెద్దిరెడ్డి కుటుంబీకుల సహకారంతో వేలాది మందికి అందిస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తధులకు స్వయంగా వడ్డించారు. వీరికి మొదటి నుంచి దేవుళ్లపై అపారమైన నమ్మకం భక్తి ఉంది. ప్రతి దేవతా కార్యక్రమాలకు తమకు తోచింది అందిస్తూ ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవుడికి సేవ చేయడంలో ఎప్పుడూ ముందుంటామని దేవుడి సేవ ప్రజా సేవ చేయడమంటే తమకెంతో ఇష్టమని చెప్పారు. అన్నదాన ట్రస్టుకు పెద్దిరెడ్డి కవితమ్మ సోదరి కల్పనా రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా అందించి తనలోని భక్తిని చాటారు. ఆమె చేసిన విరాళానికి పలువురు మహిళలు కొనియాడుతూ పెట్టడంలో ఇవ్వడంలో పెద్దిరెడ్డి కుటుంబానికి ఎవరు సాటి రారన్నారు. అనంతరం వీరిని పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య కొండ మాజీ చైర్మన్ మల్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు దేవి రెడ్డి పద్మజా రెడ్డి, వైసీపీ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు రెడ్డి కుమారి(డిష్ కుమారి), కురబలకోట మండలాధ్యక్షురాలు నక్క రమాదేవి, కుమారి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు..

# మహాశివరాత్రి పురస్కరించుకొని తంబళ్లపల్లి శాసనసభ్యులు పాదయాత్ర..

**- మండుటెండని సైతం లెక్కచేయక పాదరక్షకులు ధరించకుండా కాలిబాటన స్వామి వారి చెంతకు ..**

**- వందలాది మంది వైసీపీ శ్రేణులు సంఘీభావం..**

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 15 - (రిపబ్లిక్ న్యూస్) -** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక నియోజకవర్గ పరిధిలోని తంబళ్లపల్లి మండల పరిధిలో వెలసి సుమారు ఎనిమిది వందల సంవత్సరాలు చరిత్ర కలిగి భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మల్లయ్యగా, సంతాన ప్రాప్తి అమ్మవారిగా విరాజిల్లుతున్న మహిమాన్వితాక్షేత్రం సాధు కొండల మధ్య కొలువై అలరాలుతున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయానికి తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఉదయం ఏడు గంటలకు పాదయాత్ర నడుమ మండుటెండని సైతం లెక్కచేయకుండా పాదరక్షకులు ధరించకుండా కాలిబాటన సుమారు 9 కిలోమీటర్లు కొండ ఎక్కి స్వామివారి చెంతకు చేరుకున్నారు. ద్వారకానాథ్ రెడ్డికి వందలాది మంది వైసీపీ శ్రేణులు మదనపల్లి, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా తరిలొచ్చి సంఘీభావం తెలిపారు. సుమారు 10 సంవత్సరాలుగా ద్వారకానాథ్ రెడ్డి నియోజకవర్గంలో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రతి శివరాత్రికి నడక మార్గం ద్వారానే వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది కూడా మరింత రెట్టింపు ఉత్సాహంతో వైసీపీ శ్రేణుల కలయికతో ఉత్సాహంగా నడిచి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో కొద్దిసేపు సేద తీరారు. ఆలయ పూజారులు గౌరవ మర్యాదలతో పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దర్శన గుండం ద్వారా వెళ్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ పూజారులచే వేద ఆశీర్వచనం స్వీకరించి తీర్థప్రసాదాలను పుచ్చుకున్నారు. వైసీపీ శ్రేణులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులను ఆప్యాయంగా పలకరించారు. దర్శన ఏర్పాట్లపై విచారించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చుంటారని వారందరికీ స్వామి వారి దర్శన భాగ్యం కల్పించాలని ఎలాంటి ఆటుపోట్లు లేకుండా సజావుగా దర్శనం కలిగేలా చూడాలని పోలీసులకు సూచించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నదాన కార్యక్రమాలు తాగునీటి వసతి మండుటెండలో వచ్చిన వారికి ఉచితంగా చల్లని మజ్జిగ అందజేశారు. ద్వారకానాథ్ రెడ్డి భక్తులను పలకరించి మళ్లీ పాదయాత్రన తిరుగు ప్రయాణమయ్యారు. అనంతరం కొండ కింద భాగాన పెద్దిరెడ్డి కుటుంబ సహకారంతో వందలాది మందికి ఉచితంగా తాగునీరు, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిరంతరం కొండపైకి ఆర్టీసీ బస్సులు నడిచాయి. ఆనాటి నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు సుమారు ఎనిమిది కిలోమీటర్లు అడవిలో వచ్చి నడిచొచ్చి దర్శించుకుని మళ్లీ తిరుగు ప్రయాణం అయ్యేవారు. అలాంటిది ఆలయ అభివృద్ధికి కంకణం కట్టుకున్న శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిలు గత వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయలు వేచించి నిద్రాహారాలు మాని నిరంతరం శ్రమించి తారు రోడ్డు సౌకర్యం కల్పించారు. కొండలను చీల్చుకుంటూ రోడ్డు వేయించారు. భక్తుల సౌకర్యార్థం ఇతర వాహనాలతో పాటు బస్సులలో వెళ్లి స్వామివారిని దర్శించుకుంటూ వేలాది మంది భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నడిచి వచ్చేవాళ్లు వాహనాల్లో వస్తున్నారంటే దీనికంత పెద్దిరెడ్డి కుటుంబం చొరవేనంటూ ఎన్నో పార్టీలు అధికారాన్ని శాసించిన, ఎంతోమంది ఈ ప్రాంతం నుండి శాసనసభ్యులుగా గెలిచిన ఎవరూ చేయలేని అభివృద్ధిని పెద్దిరెడ్డి కుటుంబం చేసి చూపించిందని వాళ్లకు ఎప్పటికీ రుణపడి ఉంటామని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ సెక్రటరీ ఆముదాల మధుసూదన్ రెడ్డి, ములకలచెరువు మండలాధ్యక్షుడు కోటిరెడ్డి మాధవరెడ్డి, జడ్పీటీసీ మోహన్ రెడ్డి, టెలికామ్ అడ్వైజరీ సభ్యుడు ముట్రా దామోదర్ రెడ్డి, వందలాది మంది వైసీపీ శ్రేణులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు..

















# నగరంలో ఆధ్యాత్మికత నింపిన శివమహోత్సవం

**అరుణాచలేశ్వరుని కళ్యాణ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**ఆ పరమ శివుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్ష**







**అనంతపురం ఆధ్యాత్మికం, ఫిబ్రవరి 15,(రిపబ్లిక్ న్యూస్):** అనతంపురం నగరంలో నిర్వహించిన శివమహోత్సవం నగరంలో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపిందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ నిర్వహించిన శివమహోత్సవంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబులతో కలిసి పాల్గొన్నారు. 15వేల శివలింగాలతో నిర్వహించిన మహా అభిషేక కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అరుణాచలేశ్వరుని కళ్యాణ వేడుకను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురం నగరంలో అత్యంత పవిత్రమైన మహా శివరాత్రి రోజున ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన చల్లా లక్ష్మీప్రసాద్ దంపతులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలపై ఆయన మహాదేవుని ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు.



# విద్యారంగాన్ని విస్మరించిన కూటమి సర్కారు

**ఫీజుల పథకంలో కోత బకాయిల ఎగవేత**

**...సంక్షోభ కేంద్రాలుగా మారుతున్న సంక్షేమ హాస్టళ్ళు**

**..అటకెక్కిన నాడు నేడు**

**..తల్లికి వందనం ఎగనామం లబ్దిదారుల కుదింపు**

**.. దిగజారిన యూనివర్సిటీల ప్రమాణాలు**

**చీజ సురేష్ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కుప్పం నియోజకవర్గం**



కుప్పం (రిపబ్లిక్ న్యూస్ )ఫిబ్రవరి 15

కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యారంగాన్ని విస్మరించింది. విద్యపై చేసిన కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయి. విద్యారంగానికి కేవలం 9.5 శాతం మాత్రమే బడ్జెట్ లో నిధుల కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నది. ముఖ్యంగా ఫీజుల పథకంలో చేసిన కేటాయింపులు విద్యార్థులకి తీవ్ర అన్యాయం చేసింది. గత బకాయిల గురించి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత బకాయిలు ఈ విద్యా సంవత్సరంతో కలుపుకుంటే 8 వేల 900 కోట్ల రూపాయలు ఉన్నాయి. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం కేవలం 3 వేల 836 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసింది. మూడు రోజుల క్రితం బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ద్వారా 1200 కోట్లు విడుదల చేస్తున్నట్లు లోకేష్ చేసిన ట్వీట్ కేవలం ఒక ప్రకటనగా మాత్రమే మిగిలింది. బకాయిలు ఇవ్వకుండా పూర్తి నిధుల కేటాయింపులు విద్యపై చేయకుండా విద్యార్థుల్ని కూటమి సర్కారు తీవ్రంగా వంచించింది. ఉన్నత విద్యపై చేసిన కేటాయింపులు కేవలం రెండువేల 566 కోట్ల రూపాయలు మాత్రమే. విశ్వ విద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అభివృద్ధి కి ఇవి ఏమాత్రం సరిపోవు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విశ్వ విద్యాలయాల పాలక మండళ్ళ సమావేశాలు ఒక్కసారి కూడా జరుపలేదు. యూనివర్సిటీలని నీరుగార్చే విధంగా వ్యవహరించింది. బడ్జెట్ కేటాయింపుల్లోనూ అన్యాయం చేసింది. తల్లికి వందనం గత సంవత్సరం ఇవ్వాల్సినవి పూర్తి స్థాయిలో లబ్ది దారులకి ఇంకా నేటికీ అందివ్వలేదు. 80 లక్షల మందికి ఇవ్వాల్సి ఉండగా ఇప్పుడు బడ్జెట్ లో కూడా 67 లక్షల మందికే ఇస్తున్నట్లు అవాస్తవ గణాంకాలని కూటమి ప్రభుత్వం పేర్కొన్నది. అందుకు బడ్జెట్ లో కేవలం 9 వేల 668 కోట్ల రూపాయలు కేటాయించి లబ్ది దారుల్ని కుదించివేసింది. సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాలకు చేసిన మూడు వందల కోట్ల రూపాయల కేటాయింపులు విద్యార్థుల సంక్షేమానికి ఏమాత్రం సరిపోవు. హాస్టళ్లలో విద్యార్థులు పౌష్టికాహారం అందక భోజనం చేయలేక పోతున్నారు. వైద్య సదుపాయాలు, కనీసం వసతులు లేని కారణంగా కలుషితమైన వాతావరణం వల్ల అనారోగ్యానికి గురై ఆసుపతుల పాలవుతున్నా కూడా ప్రభుత్వం స్పందించడం లేదు. చేసిన కేటాయింపులు విద్యార్థుల సంక్షేమానికి సరిపోవు. సాధారణ విద్యకి చేసిన 34 వేల 825 కోట్ల రూపాయలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడవు. గత జగన్ ప్రభుత్వం హయాంలో నాడు, నేడుతో 32 వేల పాఠశాలల అభివృద్ధికి విశేషమైన కృషి జరిగింది. కూటమి సర్కారు బడ్జెట్ దీన్ని పక్కన పెట్టింది. ఆంగ్ల మాద్యమం అటకెక్కింది. బాత్ రూమ్, మరుగుదొడ్ల నిర్వహణ, బైజూస్ కంటెంట్ పాఠాలని గాలికొదిలేసింది. విద్యా శాఖ మంత్రి లోకేష్ ని పొగడ్తలతో కీర్తించడమే పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం చేసాడు. విద్యారంగాన్ని గాలికొదిలేసి స్వల్ప కేటాయింపులు చేసి విద్యార్థుల్ని బడ్జెట్ కేటాయింపుల్లో మోసం, తీరని అన్యాయం చేసింది. బడ్జెట్ లో విద్యపై అరకొర కేటాయింపులు చేసి లోకేష్ కి జాకీలు ఎత్తే ప్రచారాన్ని కూటమి సర్కారు సాగిస్తుంది. బడ్జెట్ కేటాయింపుల్లో విద్యార్థులకి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా కూటమి సర్కారుపై ఉద్యమిస్తాం. పోరాటాలు సాగిస్తా



# మారు మ్రోగిన .. శివనామ స్మరణం

**భక్తిశ్రద్ధలతో శివుని దర్శనం -కిటకిటలాడిన శివాలయం**



**అనంతపురం ఆధ్యాత్మికం, ఫిబ్రవరి 15, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న శివాలయంలో శివనామ స్మరణం మారుమ్రోగింది. ఆదివారం భక్తులు తల స్నానం చేసి నూతన వస్త్రాలను ధరించి భక్తిశ్రద్ధలతో శివున్ని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా నగరంలోని శివాలయం భక్తులతో కీటకటలాడింది. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నగరంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. శివుని దర్శనం నిమిత్తం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శివుని దర్శించేందుకు భక్తులు క్యూ కట్టారు. పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతులు నిర్వహిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా శివునికి ప్రత్యేకించి వెండి ప్రతిమను తొడిగి ప్రత్యేకించి పూలమాలలు వేసి అలంకరించారు. వెండి ప్రతిమతో అలంకారణలో శివలింగం భక్తులకు దర్శనమిచ్చింది. శివాలయం విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించారు.అందులో భాగంగా భక్తుల కోసం ప్రత్యేకించి బారిగేడ్లను ఏర్పాటుచేసి శివుని దైవదర్శనం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లను చేపట్టారు.అందుకు తగ్గట్టుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మహాశివరాత్రి సందర్భంగా నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.






# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయల అభివృద్ధి...

**- భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి - అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి**

**- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాణి దంపతులు...**







**మెదక్ జిల్లా ప్రతినిధి పిబ్రవరి 15(రిపబ్లిక్ న్యూస్ )**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయల అభివృద్ధి కోట్లది రూపాయలు మంజూరు చేయించి జాతరకు వచ్చే భక్తులకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం మహా శివరాత్రి సందర్భంగా ఏడుపాయలకు చేరుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాణి దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రోహిత్ రావ్ శివాణి దంపతులు వన దుర్గామాతకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యే రోహిత్ రావ్ శివాణి దంపతులకు శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయలను అభివృద్ధి చేసేందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జరుగుతున్న జాతరకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున భక్తులకు అవసరమైన వసతులు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సేవలు అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ ఆలయ ఈఓ వీరేశం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి పల్లి ఆంజనేయులు గౌడ్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి జిల్లా నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంతప్ప మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయాక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్ ఆలయ సిబ్బంది, ఆలయ పూజారులు, పాపన్నపేట కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.





# ఓంకార క్షేత్రంలోఎద్దుల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం



**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి,15, (రిపబ్లిక్ న్యూస్) ;** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారు వెలసిన ఓంకార క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు.శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తెలుగు దేశం పార్టీకి చెందిన రైతు కమిటీలు ఈ పోటీలు నిర్వహించారు. పాల పండ్ల విభాగంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రముఖ న్యాయవాది తులసి రెడ్డి తనయుడు టిడిపి యువనేత తాతిరెడ్డి మునిష్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. రైతు సంబరాలలో భాగంగా ఈ ఎద్దుల బల ప్రదర్శన పోటీలను నిర్వహించడం జరుగుతుందని మండలంలోని రైతులు ఎద్దుల యజమానులు సంతోషాలతో తిలకించలని కోరారు. ఈ పోటీలు రైతుల మధ్య స్నేహభావం పెంపొందించే విధంగా ఉండాలని కోరారు. ఎద్దుల బల ప్రదర్శన పోటీలను కేవలం రైతుల సంబరాల్లో భాగంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అంతే కాకుండా ఆలయ చైర్మన్ అల్లే చెన్నారెడ్డి ఎద్దుల బలప్రదర్శన పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు రైతుల సహకారంతో ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగు గంగ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు కంచర్ల మనోహర్ చౌదరి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మడి నాగ కృష్ణారెడ్డి, అల్లె ఈశ్వర్ రెడ్డి, బైరెడ్డి లక్ష్మిరెడ్డి,కమిటీ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

# ఓం నమఃశివాయ నినాదంతో మారుమోగిన శైవ క్షేత్రాలు

**వేలాదిగా భక్తులు శైవ క్షేత్రాలలో జాగరణ**

**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 15, (రిపబ్లిక్ న్యూస్) ;-** ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీ గంగ ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి, నల్లమల్ల అభయారణ్యంలో వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వరం స్వామి ఆలయం, విష్ణు నందీశ్వర ఆలయం, అతి పురాతనమైన శివనందీశ్వరాలయం శివ భక్తులతో ఓం నమశ్శివాయ నినాదంతో మారుమ్రోగాయి. గుండ్ల బ్రహ్మేశ్వరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం చెక్కభజన పౌరాణిక నాటకాలను ప్రదర్శించడం జరిగింది. గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ అల్లే చెన్నారెడ్డి మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తు చర్యలు చేపట్టారు.కాగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ భక్తులకు వసతి సదుపాయాలు కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాగారం చేసేందుకు ఓంకారం చేరుకోవడంతో భక్తుల కాలక్షేపం కోసం భరతనాట్యం, చెక్క భజన, పౌరాణిక నాటకం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా శివనందీశ్వర ధర్మకర్తల మండలి చైర్మన్



మద్ది గారి పుష్పరాజ్ ఆధ్వర్యంలో చెక్కభజన, కోలాటం ఏర్పాటు చేయడం జరిగింది. విష్ణు నందీశ్వర దేవాలయంలో చైర్మన్ అంబటి తిరుపం రెడ్డి, వెంగల రెడ్డి పేట గ్రామ సర్పంచ్ పల్లె నాగమణి, పల్లె సోమశేఖర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలైన కోలాటం, చెక్కభజన ఏర్పాటు చేసి జాగరణ సందర్భంగా భక్తులకు కనువిందు చేయడం జరిగింది. ఓం నమశ్శివాయ నినాదంతో భక్తులు భక్తిశ్రద్ధలతో రాత్రంతా నిద్ర మేలుకొని శివాలయాలలో జాగారం చేయడం తమ పాపాలు పరిహారం కావాలని ఆ శివయ్యకు ముక్కుకోవడం జరిగింది. వేలాది భక్తుల రాకతో ఆలయాల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ మంద జావలి ఆల్ ఫోన్స్ ఆధ్వర్యంలో ఎస్సై జగన్మోహన్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ఆ ఆలయాల పరిధి లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అలాగే వాహన రాకపోకల సమయం,ఆలయాల పరిసరాలలో ట్రాఫిక్ జామ్ కాకుండా నియంత్రించడం జరిగింది. ఆయా ఆలయాల పరిధిలో ధర్మకర్తల



మండల సభ్యులు పెద్దలు పర్యవేక్షించడం జరిగింది. ఆలయాలకు వచ్చే భక్తులకు ఓంకారంలో శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులతో పాటు ఆర్యవైశ్య అన్నదాన సత్రం, రామాపురం సత్రం, రెడ్ల సత్రంలో నిర్వాహకులు భోజన సదుపాయాన్ని కల్పించారు. భక్తులకు త్రాగునీరు భోజనాలు ఎలాంటి కొరత లేకుండా ఏర్పాటు చేయడం జరిగింది

## వైద్య సౌకర్యాలు

ఆలయాలకు వచ్చే భక్తులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతే ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 24 గంటలు రోగులకు వైద్య సేవలు అందించడం జరిగింది. ఇలాంటి సమస్యలు ఉన్న వారికి తగిన వైద్యం అందించడం జరిగింది.



# హమ్మయ్య! గుబులువీడింది. గండంగడిచింది

## ఊపిరి పీల్చుకున్న కాఖీలు, అధికారులు.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 15 రిపబ్లిక్ న్యూస్.**
భయం భయంగా గుండాల కొనలో ఎక్షణం ఏమి జరుగుతుందోనని బారీ బందొబస్తు నిర్వహించిన కాఖీలు, అధికారులు శివరాత్రి పర్వదిన మైన ఆదివారం సాయంత్రం వరకు ఎలాంటి అవ్వాంచనీయ సంఘటనలకు చోటు లేకుండా భక్తులు అటవీ ప్రాంతమైన వై. కోట సమీపంలో ఉన్న గుండాలకోనలో నిబ్బరం గా ఎలాంటి భయాలకు అవకాశం లేకుండా బ్రహ్మాండంగా పూజలు అందుకున్నారు. దీంతో భక్తులు కోసం బందో బస్తు నిర్వహించిన కాఖీలు, అధికారులు హమ్మయ్య గండం గడిచింది భక్తులు బ్రహ్మాండం గా పూజలు అందుకున్నారని ఊపిరి పీల్చు కున్నారు. ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తులు వేల సంఖ్యలో గుండాలకోనకు చేరుకున్నారు. భక్తులను చేరవేసేందుకు వై. కోట గ్రామం నుంచి నిరంతరం 8,ఆర్. టి. సి. బస్సులు తిరగడానికి ఏర్పాటు చేశారు. కొనలో కి వెళ్లిన జనాలు, భక్తులకు మొక్కుబడులు ఉన్న దాతలు బారీగా అన్న దాన కార్యక్ర మాలు నిర్వహించడం జరిగింది. తిరుపతి ఆర్. డి. వో. రామోహన్ దంపతులు, కుటుంబ సభ్యులు శివున్ని దర్శనం చేసుకున్నారు.





ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. వై. కోటకు అత్యంత సమీపంలో ఉన్న గుండాలకోన ఎంతో అందంగా, ఆహ్లాద కరంగా ఉండన్నారు. సప్త గుండాలు కలిగిన ఇలాంటి కోన రాష్ట్రంలో ఎక్కడ లేదన్నారు. ఇలాంటి దర్శనభాగ్యం తనకు దక్కడం ఎన్నో జన్మల పుణ్య పలం అన్నారు. ఈ కోన చరిత్ర పూజారి చెబుతుంటే వళ్ళు పులకరించి ఇంకా, ఇంకా వినాలనిపిస్తుంది అన్నారు. అనాదిగా ఈకోనకు భక్తులు వేలాది సంఖ్యలో కాలినడకన రెండు మూడు రోజుల ముందే చేరుకొని, శివరాత్రి తర్వాత మరో మూడు రోజుల పాటు కొనలోనే నిద్ర చేసి మొక్కులు తీర్చు కొనేవారు, ఈ రెండు, మూడు రోజులు కొనలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు,



హారికథలు నిర్వహించే వారు. అయితే గత ఏడాది కోనకు కాలినడకన వచ్చే భక్తులు గజరాజు ల దాడిలో మృతి చెందడంతో ఈ ఏడాది శివరాత్రికి మూడు రోజుల కార్యక్రమాలను ఒక్క రోజుకు కుదిస్తూ కాలినడక భక్తులను నిషేధించి, అందరిని బస్సు సౌకర్యాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా భారీబందోబస్తూ



మధ్య భక్తులకు దర్శనాలు అందించడం జరిగిందని ఆర్. డి. వో తెలియజేశారు . ఈ కార్యక్రమంలో తహసీల్దార్, యామిని, ఎం. పి. డి. వో. విజయరావు, ఎం. ఆర్. ఐ. మల్లికార్జునరెడ్డి, ఓబులవారిపల్లి సెక్రటరీ బాలసుబ్రమణ్యం, సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు అటవీ శాఖ అధికారులు ఉన్నారు.



# కాటి కోటేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**బ్రహ్మోత్సవాల్లో మంత్రి ప్రత్యేక పూజలు**
**ఇరువర్గాలతో చర్చించి సమస్య పరిష్కరించిన మంత్రి**
**ఆలయ వివాదానికి ముగింపు- పూజారికి మళ్లీ విధులు**
**అన్నదాన కార్యక్రమానికి మంత్రి లక్ష విరాళం**

**శ్రీ సత్యసాయి ఆధ్యాత్మికం, ఫిబ్రవరి 15,(రిపబ్లిక్ న్యూస్):**
తాడిమర్రి మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపంలోని కాటి కోటేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం మంత్రి కాటి కోటేశ్వర క్షేత్రంలో మూలవిరాట్ కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికి ఆలయ సంప్రదాయాల ప్రకారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన పూజారి వ్యవహారంపై గతంలో ఏర్పడిన వివాదాన్ని మంత్రి సమగ్రంగా



పరిశీలించారు. గత ప్రభుత్వ కాలంలో ఆలయ పూజారిగా విధులు నిర్వహిస్తున్న బాల శివను తొలగించి పలు ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని మంత్రి తెలుసుకున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన మంత్రి, ఇరువర్గాలతో చర్చలు జరిపి వివాదాన్ని సర్దుబాటు చేశారు. పండుగను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుని, తొలగించబడిన పూజారికి మళ్లీ యథావిధిగా విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు అందజేశారు.

**మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం**

ఆలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మంత్రి స్వయంగా పరిశీలించి, భక్తులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమం మరింత విస్తరించేందుకు లక్ష రూపాయల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. తదనంతరం దేవాదాయ శాఖ అధికారులు మంత్రిని ఘనంగా సన్మానించగా, మంత్రి తాడిమర్రి మండల కేంద్రానికి చేరుకుని పురాతన కోనేరు శివాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ భక్తులకు మహాశివరాత్రి పర్వదినాన్ని శాంతి, సౌహార్ద వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ, పరస్పర గౌరవంతో పండుగలు నిర్వహించడం సమాజానికి మేలని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా మంత్రి జోక్యంతో ఆలయ వివాదం పరిష్కారమై, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా కొనసాగుతున్నాయి.

## క్షయ వ్యాధి రోగులకు పౌష్టిక ఆహార కిట్ల అందజేత

**జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం -పాల్గొన్న బీసీసంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ**




**శ్రీ సత్యసాయి సంక్షేమం, ఫిబ్రవరి 15,(రిపబ్లిక్ న్యూస్)**
క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు పౌష్టిక ఆహార కిట్లను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అందజేశారు. ఆదివారం పెనుకొండ పట్టణంలోని మంత్రి గారి క్యాశీపు కార్యాలయంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ఎన్ టి ఈ పి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు.


**సరైన పోషకాహారం ద్వారా క్షయ వ్యాధి నిర్మూలన**
ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ క్షయ వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తున్నదని తెలిపారు. రోగులు నిర్దేశించిన కాలం పాటు మందులు క్రమం తప్పకుండా తీసుకుంటే పూర్తిగా కోలుకోవచ్చని సూచించారు. సరైన పోషకాహారం, పరిశుభ్రత, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, ఇతర ఖర్చులకోసం ప్రభుత్వమే ప్రతినెల 1000 రూపాయలు అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు. ప్రభుత్వం క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చడంలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు రోగులు పాల్గొన్నారు.

# సంత్ శ్రీ సేవాలాల్ చరిత్ర ఆదర్శనీయం

**బంజారాలో అన్ని రంగాలలో రాణించాలి**
**సేవా గడ్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం**
**అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**

**అనంతపురం గుత్తి, ఫిబ్రవరి 15,(రిపబ్లిక్ న్యూస్):**
బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్ర ఎంతో ఆదర్శనీయమైనదని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సేవా గడ్ లో జరిగిన సేవాలాల్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు వేడుకలలో పాల్గొన్నారు.

**బంజారాలు అన్ని రంగాలలో రాణించాలి**
ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ సేవా గడ్ సందర్శించుకోవడం తాను ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అంతేగాక దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఈ పుణ్యక్షేత్రానికి బంజారా సమాజం వేలాదిగా తరలిరావడం శుభపరిణామన్నారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల దాకా ఉన్న బంజారాలు అన్ని రంగాలలో రాణించాలని ఎంపీ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన బంజారా అభ్యున్నతికి కృషి చేస్తున్నదని కేంద్రంలో నరేంద్ర మోది, కూటమి ప్రభుత్వంలో



గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బడుగు బలహీన వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని అనంతపురం లాంటి వెనుకబడిన ప్రాంతంలో సంత సేవాలాల్ మహారాజ్ జన్మించి ప్రపంచానికి దశ దిశ నిర్దేశం చేసారన్నారు. తన జీవితమంతా పేదల కోసం త్యాగం చేశారని సమాజ శ్రేయస్సుకు పాటుపడిన శ్రీ సేవాలాల్ ఆశయాలను నెరవేర్చే విధంగా కృషి చేయాలన్నారు. మానవతా విలువలను పెంపొందించి అనేక విధాలుగా జాతికి సేవ చేసిన సేవా తత్పరుడు మహనీయుడు సేవలాల్ మహారాజ్ అని ఎంపీ కొనియాడారు.

**రూ.50 లక్షల రూపాయల నిధులు మంజూరు**
తాండలలో నివసించిన పేదవర్గాలు కూడా కష్టాలను నమ్ముకొని నిజాయితీగా తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని దురావాట్లకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును పొందాలని ఎంపీ ఆకాంక్షించారు. గత ప్రభుత్వం గిరిజన బంజారాలకు ఎలాంటి ప్రోత్సాహం అందించలేదని ప్రస్తుతం సేవా గడు ఉత్సవాలకు అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి సుమారు రూ.50 లక్షల రూపాయల దాకా నిధులు మంజూరు చేయడం పట్ల ప్రభుత్వానికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తాను సేవాగడ్ లో ఎంపీ నిధుల నుండి సుమారు రూ .10లక్షల వ్యయంతో భోజనశాల నిర్మాణానికి అందించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామన్నారు.

**పదివేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక**
47 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఉన్న ఈ ప్రాంతాన్నితాను నందనవనంగా తీర్చిదిద్దేందుకు సుమారు పదివేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించామని వాటిని సంరక్షించే బాధ్యత ప్రస్తుత సభ్యులు తీసుకోవాలని కోరారు. బంజారాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియం చేసుకోవాలని అలాగే ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్య వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందని గిరిజన బంజారా కుటుంబంలోని పిల్లలు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. రానున్న రోజుల్లో సభ మందిరం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. సేవా గడులో ఎంతో భక్తి భావం కనిపిస్తోందని రానున్న రోజుల్లో ఈ పుణ్యక్షేత్రం మరింతగా అభివృద్ధి అవుతుందని ఎంపీ ఆకాంక్షించారు.

**మురళి ఆత్మ శాంతికి .. మౌనం పాటించి నివాళులు**
దేశ సేవలో తన ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రులను ఎంపీ సన్మానించారు. అంతకుముందు మురళి ఆత్మ శాంతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాగడ్ ట్రస్టు సభ్యులు జగన్నాథ్ నాయక్ కేశవ నాయక్ అశ్వర్థ నాయక్ శంకర్ లాల్ గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్, డి.ఎస్.పి శ్రీనివాసులు, డి ఎల్ డి ఓ విజయలక్ష్మి, గుత్తి తాసిల్దార్ పుణ్యవతి, డిటిడబ్ల్యు శ్రీనివాసరావు, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తలపై రాడ్డుతో బాది .. బంగారు గొలుసు అపహరణ

**గుర్తుతెలియని అపరిచితుడు దాడి -మహిళ తలకు తీవ్ర గాయాలు**

**బుక్కరాయసముద్రం క్రైమ్, ఫిబ్రవరి 15, (రిపబ్లిక్ న్యూస్):**
బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో స్థానిక గాంధీనగర్ సమీపాన ఉన్న వెంకటేష్ కు చెందిన టీకేఫ్ లో ఈ దారుణ సంఘటన చోటుచేసుకుంది. దీంతో బుక్కరాయసముద్రం ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వెంకటేష్ భార్య క్యాంటీన్ లో ఉండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి శీతల పానీయం కోసం అని వచ్చి ఒంటరిగా ఉన్న శ్రీదేవి తల, చేతులపై రాడ్డుతో బాదాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన వెంటనే ఆమె మెడలోని నాలుగు తులాల బంగారాన్ని దొంగలించి పారిపోయాడు. వెనకనుంచి తల చేతులపై రాడ్డుతో బాదడం వల్ల తీవ్ర గాయాల పాలై రక్తం కారుతోంది. స్థానికులు గమనించి ఆమెను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## వలీ వ్యవహారంపై నాగబాబు స్పందన...
## రూ.25 వేల ఆర్థికసాయం

రాష్ట్రంలోని చిరువ్యాపారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు భరోసా ఇచ్చారు. పొట్టకూటి కోసం మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్న వలీ అనే చిరు వ్యాపారిని కొందరు భయభ్రాంతులకు గురిచేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కాదని ఆయన హితవు పలికారు.ఈ దాడి ఘటన తర్వాత ఎందరో చిరువ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారని నాగబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. దాడి కారణంగా శివరాత్రి నాడు తాను వ్యాపారం చేసుకోలేకపోయానని బాధిత వ్యక్తి వలీ ఆవేదన వ్యక్తం చేయగా, అతనికి వ్యక్తిగతంగా రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించినట్లు నాగబాబు తెలిపారు. వలీ వంటి ఎందరో చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దాడిని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా ఖండించడం సంతోషంగా ఉందని తెలిపారు.

# పాక్‌ని పడగొట్టారు




శివం దూబె (27, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (25, 24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఛేదనలో పాకిస్తాన్ 18 ఓవర్లలోనే చేతులెత్తేసింది. భారత బౌలర్లు సమిష్టిగా విజృంభించారు. హార్దిక్, బుమ్రా, వరుణ్, అక్షర్ రెండేసి వికెట్లు పడగొట్టగా పాకిస్తాన్ 114 పరుగులకే కుప్పకూలింది. పాక్ తరపున ఉస్మాన్ ఖాన్ (44, 34 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్ గ్రూప్ దశలో ఆఖరు మ్యాచ్‌లో బుధవారం నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

**పాక్ పేకమేడలా..**

176 పరుగుల ఛేదనలో పాకిస్తాన్ చతికిల పడింది. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై పేస్‌తో వికెట్ల వేట మొదలెట్టిన భారత్ ఆ దిశగా విజయవంతమైంది. హార్దిక్ ఓవర్లో ఫర్హాన్ (0) డకౌట్ కాగా.. బుమ్రా ఓవర్లో ఆయుబ్ (6), సల్మాన్ (4) నిష్క్రమించారు. 2 ఓవర్లలో 13/3తో పాకిస్తాన్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. అక్షర్ పటేల్ మాయకు బాబర్ ఆజమ్ (5) బోల్తా పడటంతో పాక్ ఓటమి కోరల్లో పడింది. పవర్‌ప్లేలో ఆ జట్టు 38/4తో డీలా పడగా మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేసింది. ఈ దశలో ఉస్మాన్ ఖాన్ (44), షాదాబ్ ఖాన్ (14) భారత బౌలర్లను ఎదురించే ప్రయత్నం చేశారు. పది ఓవర్లలో 71/4తో నిలువగా.. బ్యాటర్లపై తీవ్ర ఒత్తిడి పడింది. దూకుడుగా ఆడేందుకు యత్నించిన పాక్ బ్యాటింగ్ లైనప్ పేక మేడలా కుప్పకూలింది. షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్) పాక్ ఓటమి అంతరానికి కుదించాడు. 18 ఓవర్లలో పాకిస్తాన్ 114 పరుగులకు కుప్పకూలింది. భారత్ 61 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్య (2/16), బుమ్రా (2/17), అక్షర్ పటేల్ (2/29), వరుణ్ చక్రవర్తి (2/17) రెండేసి వికెట్లు పడగొట్టారు. తిలక్ వర్మ (1/11), కుల్‌దీప్ యాదవ్ (1/14) రాణించారు.

**కిషన్ ఒక్కడే..!**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు కలిసి రాలేదు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ (0) పాక్ కెప్టెన్ సల్మాన్ ఉచ్చులో పడ్డాడు. అభిషేక్‌ను ఊరించిన సల్మాన్ ఇన్నింగ్స్ ఆరో బంతికే అవుట్ చేశాడు. అభిషేక్ వికెట్ పాక్ శిబిరంలో ఉత్సాహం నింపింది. కానీ, మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ (77) దుమ్మురేపాడు. షహీన్ షా అఫ్రిదికి సిక్సర్‌తో స్వాగతం పలికిన ఇషాన్ కిషన్.. పవర్‌ప్లేలో రెచ్చిపోయాడు. 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. తిలక్ వర్మ (25)తో కలిసి రెండో వికెట్‌కు 46 బంతుల్లో 87 పరుగులు జోడించాడు. 10 ఫోర్లు, 3 సిక్సర్లతో పాక్ బౌలర్లను ఒత్తిడిలో పడేసిన ఇషాన్ సెంచరీ దిశగా సాగాడు. ఆయుబ్ ఓవర్లో కిషన్ వికెట్ కోల్పోయాడు. కిషన్ అవుటయ్యే సరికి భారత్ స్కోరు 88/2 కాగా.. అందులో కిషన్ ఒక్కడే 77 పరుగులు చేశాడు.

కిషన్ నిష్క్రమణతో భారత దూకుడుకు కళ్లెం పడింది. తిలక్ వర్మ ఓ ఎండ్‌లో కుదురుకున్నా బౌలర్లపై ఎదురుదాడి చేయలేకపోయాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32), తిలక్‌లు 38 పరుగుల భాగస్వామ్యంతో మెరిసి భారీ స్కోరుకు పునాది వేశారు. కానీ స్పిన్నర్ ఆయుబ్ ఇన్నింగ్స్ 15వ ఓవర్లో వరుస బంతుల్లో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య (0)ను సాగనంపి గట్టి దెబ్బకొట్టాడు. సూర్య తనదైన దూకుడు చూపించకపోయినా.. తొలుత తిలక్‌తో, ఆ తర్వాత దూబెతో కీలక భాగస్వామ్యాలు నిర్మించాడు. శివం దూబె (27), రింకు సింగ్ (11 నాటౌట్) ఆఖరు ఓవర్లో 16 పరుగులు పిండుకుని భారత్‌కు 175 పరుగుల స్కోరు అందించారు. పాక్ బౌలర్లలో ఆయుబ్ (3/25) మూడు వికెట్లతో మాయ చేయగా.. సల్మాన్ (1/10), ఉస్మాన్ (1/24), షహీన్ షా అఫ్రిది (1/31) తలా ఓ వికెట్ పడగొట్టారు.




## మెరుపు అర్ధశతకంతో
# చెలరేగిన ఇషాన్ కిషన్

కొలంబో వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. భారత్ నిర్దేశించిన 176 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. భారత పేసర్ల నిప్పులు చెరిగే బంతులకు సమాధానం చెప్పలేక కేవలం 34 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఛేదన ప్రారంభించిన పాకిస్థాన్‌కు హార్దిక్ పాండ్యా తొలి ఓవర్లోనే షాకిచ్చాడు. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్‌ను (0) డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత తన స్పెల్ ప్రారంభించిన జస్‌ప్రీత్ బుమ్రా.. ప్రమాదకర ఓపెనర్ సైమ్ అయూబ్ (6), కెప్టెన్ సల్మాన్ ఆఘా (4)లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేర్చి పాక్ పతనాన్ని శాసించాడు. ఆ తర్వాత బాబర్ అజామ్ (5)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేయడంతో పాక్ నాలుగో వికెట్ కోల్పోయింది. దీంతో పాకిస్థాన్ 4.5 ఓవర్లు ముగిసేసరికి టాపార్డర్‌ను కోల్పోయింది. ప్రస్తుతం క్రీజులో షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ ఆడుతున్నారు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77) మెరుపు అర్ధశతకంతో కదం తొక్కాడు. తిలక్ వర్మ (25), సూర్యకుమార్ యాదవ్ (32), చివర్లో శివమ్ దూబే (27) రాణించడంతో భారత్ పటిష్ట స్థితిలో నిలిచింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ మూడు వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం బాబర్ ఆజమ్, ఉస్మాన్ ఖాన్ క్రీజులో ఉండగా.. పాక్ విజయానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.



## నమీబియాపై విజయంతో లీగ్ దశ
# ముగించిన అమెరికా

- **టీ20 ప్రపంచకప్‌లో నమీబియాపై 31 పరుగులతో అమెరికా విజయం**
- **తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 20 ఓవర్లలో 199 పరుగులు**
- **అర్ధ శతకాలతో రాణించిన సంజయ్ కృష్ణమూర్తి (68బి), మోనాంక్ పటేల్ (52)**
- **ఛేదనలో 168 పరుగులకే పరిమితమైన నమీబియా**
- **నమీబియా తరపున లౌరెన్ స్టీన్‌క్యాంప్ (58) పోరాటం విఫలం**




ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 31 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అమెరికా బ్యాటర్లు సంజయ్ కృష్ణమూర్తి, కెప్టెన్ మోనాంక్ పటేల్ అర్ధ శతకాలతో చెలరేగడంతో తొలుత భారీ స్కోరు నమోదైంది. అనంతరం లక్ష్య ఛేదనలో నమీబియా తడబడింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అమెరికా, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52) మెరుపు ఆరంభాన్ని అందించగా, చివర్లో సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. వీరిద్దరి ధాటికి అమెరికా సునాయాసంగా భారీ స్కోరు చేయగలిగింది. నమీబియా బౌలర్లలో విల్లెమ్ మైబర్గ్, గెరార్డ్ ఎరాస్మస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా, 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 168 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ లౌరెన్ స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58) ఒక్కడే అర్ధ శతకంతో పోరాడాడు. మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం లభించలేదు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ రెండు వికెట్లతో రాణించగా, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్, శుభమ్ రంజానె తలో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

కాగా, లీగ్ దశను అమెరికా విజయంతో ముగించింది. గ్రూప్-ఏలో ఉన్న అమెరికా మొత్తం 4 మ్యాచ్ లు ఆడి 2 విజయాలతో భారత్, పాక్ తర్వాత మూడో స్థానంలో ఉంది.




## మనమ్మాయిలు పాక్‌ను పడగొట్టారు
## స్పిన్నర్ల విజృంభణ

బ్యాంకాక్: టీ20 ప్రపంచక్‌పలో ఆదివారం భారత పురుషుల జట్టు పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడిస్తే... ఇదేరోజు భారత జూనియర్ అమ్మాయిలు కూడా పాక్ పని పట్టారు. మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన గ్రూప్-ఎ పోరులో భారత-ఎ జట్టు 8 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. జట్టు కెప్టెన్, స్పిన్నర్ రాధా యాదవ్ (2/11)కు తోడు సైమా ఠాకూర్ (2/14), ప్రేమా రావత్ (2/16) బౌలింగ్‌లో విజృంభించడతో.. పాక్ 18.5 ఓవర్లలో 93 పరుగులకే కుప్పకూలింది. షవాల్ జుల్ఫికర్ (23) టాప్‌స్కోరర్. స్వల్ప ఛేదనలో దినేశ్ వ్రింద (55) అజేయ అర్ధ సెంచరీతో భారత్ 10.1 ఓవర్లలోనే 97/2 స్కోరు చేసి అలవోకగా గెలిచింది. అనుష్క శర్మ (24) రాణించింది. ఈ టోర్నీలో భారత-ఎ జట్టుకిదే తొలి గెలుపు. అంతకుముందు శుక్రవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో యూఏఈ చేతిలో భారత్ ఓటమిపాలైంది.

# పోటెత్తిన అభిమానం



కొలంబో: టోర్నమెంట్ ఏదైనా సరే.. భారత్, పాకిస్థాన్ పోరుకు ఉండే క్రేజే వేరు. అందులోనూ విశ్వక్‌పలో ఇరుజట్ల మధ్య మ్యాచ్ అంటే.. క్రికెట్ ఫీవర్ మరింత హీటెక్కెడం ఖాయం. ఇప్పుడు టీ20 ప్రపంచక్‌పలోనూ అదే జరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో దాయాది జట్ల పోరును కనులారా వీక్షించేందుకు అభిమానులు ప్రేమాదాస స్టేడియానికి పోటెత్తారు. స్థానికంగా ఉండే ప్రేక్షకులే గాకుండా.. ఇరు దేశాల నుంచి అనేకమంది శ్రీలంక రాజధాని కొలంబోకు తరలివచ్చారు. భారత్ నుంచి 18వేలకు పైగా మద్దతుదారులు, పాక్ తరపున 12వేలకు పైగా అభిమానులు హాజరై తమ జట్లను ఉత్సాహపరిచారు. మ్యాచ్ రాత్రి ఏడు గంటలకు మొదలైనా, స్టేడియం గేట్లు మధ్యాహ్నం మూడు గంటలకే తెరవడంతో ముందే స్టేడియం నిండిపోయింది. బాయ్‌కాట్ వార్తల నేపథ్యంలో తొలుత ఇండో-పాక్ మ్యాచ్ జరగడంపై సందేహం నెలకొన్నా, ఆ తర్వాత పాక్ తమ నిర్ణయాన్ని ప్రకటించడంతో విమాన టిక్కెట్లకు రెక్కలొచ్చాయి. కొలంబోలో బుకింగ్స్ కూడా ముందుగానే జరిగిపోయాయి. ఒకరకంగా ఈ మ్యాచ్‌తో శ్రీలంక పర్యాటక శాఖకు భారీగా ఆదాయం చేకూరింది.

# సూపర్-8కు విండీస్
# నేపాల్ అవుట్



ముంబై: రెండుసార్లు చాంపియన్ వెస్టిండీస్ టీ20 ప్రపంచ కప్‌లో అజేయంగా దూసుకెళ్తోంది. గ్రూప్-సిలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్‌ను 9 వికెట్లతో చిత్తుచేసి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ఓవరాల్‌గా ఆరు పాయింట్లను ఖాతాలో వేసుకున్న కరీబియన్ జట్టు అందరికంటే ముందుగా టోర్నీలో సూపర్-8 బెర్త్‌ను దక్కించుకుంది. మరోవైపు వరుసగా మూడో పరాజయంతో నేపాల్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నేపాల్.. జేసన్ హోల్డర్ (4-0-27-4) దెబ్బకు 20 ఓవర్లలో 133/8 స్కోరుకే పరిమితమైంది. మాథ్యూ ఫోర్డె (4-1-10-1) పొదుపుగా బౌలింగ్ చేశాడు. దీపేంద్రసింగ్ ఐరీ (58) అర్ధ సెంచరీతో రాణించాడు. సోంపాల్ కామి (26 నాటౌట్) ఫర్వాలేదనిపించగా, మిగతా వారంతా విఫలమయ్యారు. ఛేదనలో కెప్టెన్ షాయ్ హోప్ (44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61 నాటౌట్) సత్తా చాటడంతో విండీస్ 15.2 ఓవర్లలోనే 134/1 స్కోరు చేసి గెలిచింది. హోప్‌కు హెట్‌మయెర్ (46 నాటౌట్), బ్రాండన్ కింగ్ (22) సహకరించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హోల్డర్ నిలిచాడు.

# ‘వరల్డ్ ఆఫ్ నాగబంధం‘ వీడియో పంచుకున్న మహేశ్ బాబు




సూపర్ స్టార్ మహేశ్ బాబు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఓ ఆసక్తికరమైన కొత్త సినిమా టీజర్‌పై ప్రశంసలు కురిపించారు. ‘నాగబంధం’ పేరుతో వస్తున్న ఈ సినిమా టీజర్‌ను తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని ఆయన కొనియాడారు.“‘ది వరల్డ్ ఆఫ్ నాగబంధం’ అద్భుతంగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది. త్వరలో దీన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను“ అంటూ మహేశ్ బాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్ ఇండియా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.విడుదలైన టీజర్‌ను బట్టి ఇది భారతీయ పురాణాలు, చరిత్ర నేపథ్యంతో కూడిన భారీ యాక్షన్ ఎపిక్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. సంభాషణలు లేకుండా కేవలం విజువల్స్‌తోనే కథను చెప్పే ప్రయత్నం ఆకట్టుకుంటోంది. భారీ యుద్ధ సన్నివేశాలు, రహస్యమైన పాత్రలతో టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ముఖ్యంగా నటుడు విరాట్ కర్ణ విభిన్న రూపాల్లో ఇంటెన్స్‌గా కనిపించారు.

మహాశివరాత్రి రోజున ఈ మైథలాజికల్ యాక్షన్ టీజర్‌ను విడుదల చేయడం, దానికి మహేశ్ బాబు ప్రశంసలు తోడవడంతో సోషల్ మీడియాలో మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రం 2026 వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సూపర్ స్టార్‌ని వెనక్కి నెట్టిన ఐకాన్ స్టార్!




జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన -బాహుబలి- సిరీస్ తరువాత స్టార్స్ చేసే ప్రతి సినిమా లార్జెన్ దెన్ లైఫ్ మూవీగానే చేయాలని చూస్తున్నారు. అలాంటి కథలనే ఎంచుకుంటున్నారు. బడ్జెట్ విషయంలోనూ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రతీదీ భారీ స్థాయిలోనే ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో సినిమా బడ్జెట్‌లు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. బడ్జెట్‌ని బట్టి స్టార్ల పారితోషికాలు కూడా చుక్కలని తాకుతుండటం తెలిసిందే. ఒకప్పుడు భారీ స్థాయిలో రికార్డు స్థాయి పారితోషికాలు అనేవి బాలీవుడ్ వరకే పరిమితంగా ఉండేవి.

కానీ దక్షిణాదిలో పాన్ ఇండియా సినిమాల ట్రెండ్ మొదలయ్యాక అది దక్షిణాదికి కూడా పాకింది. ప్రపంచ సినిమాతో పోలిస్తే ఇండియాలోనే సినిమాల నిర్మాణం ఎక్కువ. సినిమాల హడావిడీ కూడా ఎక్కువే. బాలీవుడ్ టు టాలీవుడ్ వరకు స్టార్స్ కూడా ఎక్కువే. అయితే పాన్ ఇండియా సినిమాల ప్రవాహం పెరిగిన స్టార్స్ భారీ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంటున్న నేపథ్యంలో ఇండియాలో అత్యధికపారితోషికాన్ని అందుకుంటున్న టాప్ 3 స్టార్స్ ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఈ జాబితాలో ఇండియా వైడ్‌గా నిలిచింది ముగ్గురు స్టార్స్. బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్. టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్. అత్యధిక పారితోషికాన్ని తీసుకుంటూ షారుక్ ఖాన్ మొదటి స్థానంలో నిలిచాడు. రెండవ స్థానంలో రజనీకాంత్‌ని వెనక్కి నెట్టి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నిలవడం గమనార్హం. మూడవ స్థానంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నిలిచారు. పారితోషికం విషయంలో ఫార్మాట్‌ని మార్చిన ఈ స్టార్స్ ఇప్పుడు సినిమా లాభాల్లో వాటాలని పారితోషికాలుగా డిమాండ్ చేస్తుండటం తెలిసిందే.బాలీవుడ్ బాక్సాఫీస్ బాద్‌షాగా పేరు తెచ్చుకున్న షారుక్ ఖాన్ వరుస ఫ్లాపుల తరువాత -పఠాన్-తో మళ్లీ ట్రాక్‌లోకి రావడం తెలిసిందే. ఈ సినిమా లాభాల్లో తన వాటా కింద షారుక్ రూ.350 కోట్లు తీసుకున్నాడు. ఇండియన్ సినిమాల్లో ఓ మీరో ఇంత పెద్ద మొత్తంలో పారితోషికంగా తీసుకోవడం ఇదే ఫస్ట్ టైమ్. ఇంత మొత్తం దక్కించుకోవడంతో షారుక్ ఇండియన్ హీరోల్లో అత్యధిక మొత్తం అందుకుంటున్న హీరోగా మొదటి స్థానంలో నిలిచాడు. ఆ తరువాత స్థానంలో బన్నీ వచ్చి చేరాడు. పుష్ప, పుష్ప 2 సినిమాలతో బ్లాక్‌బస్టర్ హిట్‌లని సొంతం చేసుకున్న బన్నీ రూ.300 కోట్లు డిమాండ్ చేస్తున్నాడు.



ఈ జాబితాలో సూపర్‌స్టార్ రజనీకాంత్ మూడవ స్థానంలో నిలుస్తున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో రజనీ నటించిన మూవీ -జైలర్-. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సొంతం చేసుకుని రజనీ కెరీర్‌లోనే రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. ఈ సినిమా నుంచే రజనీ రూ.200 కోట్లకు మించి ఒక్కో సినిమాకు డిమాండ్‌చేస్తున్నారట. అయితే ప్రస్తుతం చేస్తున్న 174వ ప్రాజెక్ట్‌కు మాత్రం ఆ మొత్తాన్ని పెంచేశారని, రూ.225 కోట్లు ఈ ప్రాజెక్ట్‌కు తీసుకుంటున్నారని తెలిసింది.

రానున్న రోజుల్లో ఈ జాబితాలోకి మహేష్ వచ్చి చేరతాడా?.. లేక ఎన్టీఆర్, రామ్ చరణ్‌లు చేరతారా అన్నది వేచి చూడాల్సిందే.



## నెగెటివిటీ ఎంత ఎదురైనా ఎక్కడో పాజిటివిటీ ఉంటుంది : అర్జున్

యాక్షన్ కింగ్ అర్జున్ తన కుమార్తె ఐశ్వర్య అర్జున్‌ను టాలీవుడ్‌కు పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన -సీతాపయనం- ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే కానుకగా విడుదలైంది. ఈ సినిమాకి క్రిటిక్స్ నుంచి పాజిటివ్ సమీక్షలు వచ్చాయి. సినిమా సక్సెస్ సందర్భంగా నిర్వహించిన థాంక్స్ మీట్ లో అర్జున్ చాలా ఎమోషనల్‌గా మాట్లాడారు.

థాంక్స్ మీట్‌లో అర్జున్ మాట్లాడిన విషయాలు ఆసక్తిని కలిగించాయి. ఆయన మాట్లాడుతూ---మా నాన్న నటుడు శక్తి ప్రసాద్ కన్నడ పరిశ్రమలో 220 సినిమాల్లో నటించారు. నాన్న గారికి నేను సినిమా రంగానికి రావడమే ఇష్టం లేదు..

నన్ను పోలీస్ అధికారిగా చూడాలనుకునేవారు. ఆయన ఒక మాట చెప్పేవారు నాకు.. మనకు ఒక్కో విషయం నెగెటివ్ గా కనబడుతుంది లైఫ్ లో.. చూడటానికి ఎక్కడో నెగెటివ్ గా ఉంటుంది. కానీ ఎక్కడో ఒక పాయింట్ లో పాజిటివిటీ ఉంటుంది..ఆ ఒక్క పాయింటే నా పాత్ర ఈ సినిమాలో-- అని తెలిపారు.

సీతాపయనం చిత్రాన్ని కేవలం ఒక సినిమాగా కాకుండా, సమాజానికి మంచి సందేశం ఇచ్చే ప్రయత్నంగా తెరకెక్కించానని అర్జున్ చెప్పారు. ఈ సినిమాకు విమర్శకుల నుండి వస్తున్న ప్రశంసలు చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని, ముఖ్యంగా నటీనటుల ప్రదర్శనను మెచ్చుకోవడం సంతోషకరమని అన్నారు.తన కుమార్తె ఐశ్వర్య అర్జున్ నటనకు ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు ఒక తండ్రిగా తాను ఎంతో గర్వపడుతున్నానని తెలిపారు. ఈ సినిమాలో గోసంరక్షణ మరియు భారతీయ సంస్కృతికి సంబంధించిన అంశాలకు లభిస్తున్న స్పందన తనకెంతో తృప్తినిచ్చిందని అర్జున్ వెల్లడించారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన అద్భుతమైన మెలోడీలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని ఆయన కొనియాడారు.ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు, సహకరించిన మీడియా మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సమావేశంలో ఐశ్వర్య అర్జున్, నిరంజన్, సాయి మాధవ్ భుర్రా, అనూప్ రూబెన్స్ తదితరులు పాల్గొన్నారు.


# రేవంత్ రెడ్డిని కలిసి తన పెళ్లికి ఆహ్వానించిన విజయ్ దేవరకొండ



టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లిపీటలు ఎక్కబోతున్న సంగతి తెలిసిందే. ఈ నెల 26న రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరగబోతోంది. ఉదయ్ పూర్ లోని ప్యాలస్ లో ఇరువురి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం జరగనుంది. చాలా కాలంగా ప్రేమలో ఉన్న వీరు... చివరకు కుటుంబ పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ఉదయ్ పూర్ లో వివాహానంతరం ప్రముఖుల కోసం హైదరాబాద్ లో రిసెప్షన్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

పెళ్లికి సమయం దగ్గర పడుతుండటంతో... విజయ్ దేవరకొండ పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నాడు. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ కలిశాడు. హైదరాబాద్ లోని రేవంత్ నివాసానికి వెళ్లి స్వయంగా పెళ్లి పత్రికను అందించాడు. తన పెళ్లికి రావాలని ఆహ్వానించాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండకు ముఖ్యమంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.


# ఓవర్సీస్‌లో ‘రాకాస‘ జోరు.. 350కి పైగా థియేటర్లలో భారీ విడుదలకు ప్లాన్



యంగ్ హీరో సంగీత్ శోభన్ నటిస్తున్న కొత్త చిత్రం ‘రాకాస’పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ కీలక అప్డేట్ వచ్చింది. ఈ మూవీ ఓవర్సీస్ థియేట్రికల్ హక్కులను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ అథర్వణ భద్రకాళి పిక్చర్స్ సొంతం చేసుకుంది. అమెరికా, యూరప్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కలిపి ఏకంగా 350కి పైగా థియేటర్లలో ఈ చిత్రాన్ని భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఓవర్సీస్ పంపిణీలో మంచి పేరున్న ఈ సంస్థ ‘రాకాస’ను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఇటీవల విడుదలైన ‘రాకాస’ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పటివరకు 1.8 మిలియన్లకు పైగా వ్యూస్‌తో యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ గ్లింప్స్‌లోని విజువల్స్, అనుదీప్ దేవ్ అందించిన నేపథ్య సంగీతం సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. టెక్నికల్‌గా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని గ్లింప్స్ స్పష్టం చేసింది. ఈ క్రేజ్ కారణంగానే ఓవర్సీస్‌లోనూ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడింది. ట్రేడ్ వర్గాల్లోనూ ఈ చిత్రంపై పాజిటివ్ బజ్ నెలకొంది.

‘మ్యాడ్’, ‘మ్యాడ్ స్క్వేర్’ వంటి వరుస విజయాల తర్వాత సంగీత్ శోభన్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ‘రాకాస’పై యూత్‌లో ప్రత్యేక ఆసక్తి ఉంది. ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. గతంలో సంగీత్ శోభన్‌తో ‘ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ’ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించి విజయం అందుకున్న మానస శర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. అంతేకాకుండా, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను వంటి అనుభవజ్ఞులైన నటులు కీలక పాత్రల్లో నటిస్తుండటం సినిమాకు అదనపు బలంగా మారింది.

# బాలీవుడ్ నటి హిమాన్షీకి బెదిరింపులు



బాలీవుడ్ ప్రముఖులకు గ్యాంగ్ స్టర్ల నుంచి వరుసగా బెదిరింపులు రావడం ఇండస్ట్రీలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సల్మాన్ ఖాన్ కు ఎప్పటి నుంచో బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా నటి, గాయకురాలు హిమాన్షీ ఖురానాకు బెదిరింపులు వచ్చాయి. రూ.10 కోట్లు ఇవ్వాలంటూ దుండగుడు ఆమెను డిమాండ్ చేశాడు. ఈమెయిల్ ద్వారా వచ్చిన వాయిస్ నోట్‌లో అడిగినది ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. జీషన్ అక్తర్ పేరుతో వచ్చిన ఈ మెయిల్‌పై హిమాన్షీ పంజాబ్ లోని మొహాలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

పంజాబీ మూవీ ‘సద్దా హక్’తో నటిగా మంచి గుర్తింపు పొందిన హిమాన్షీ, ‘జోడీ బిగ్‌డే పార్టీ’, ‘నా.. నా.. నా’ వంటి ఆల్బమ్స్‌తో అలరించారు. హిందీ ‘బిగ్‌బాస్’ సీజన్ 13లో సందడి చేసిన ఆమెకు ఇప్పుడు ఈ బెదిరింపులు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

# శ్రీశైలంలో ఘనంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**తెల్లవారుజామున 2.20 గంటలకు మొదటి దర్శనం ప్రారంభం**

**భక్తులకు సమగ్ర సదుపాయాలు - 2.50 లక్షల మంది క్షేత్రంలో -పాగాలంకరణకు 7 నుండి 8 వేల మందికి అనుమతి**



**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 15 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో శివరాత్రి పర్వదినాన తెల్లవారుజామున 2.20 గంటల నుంచే మొదటి దర్శనం ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా జాయింట్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. స్వామివారు, అమ్మవార్ల దర్శనార్థం ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, భక్తుల రద్దీ, మౌలిక సదుపాయాల నిర్వహణ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల రాక నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి చిన్న ఇబ్బందులు కూడా తలెత్తకుండా సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి భక్తుడు స్వామి అమ్మవార్ల దర్శనం సంతృప్తికరంగా చేసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. క్యూ లైన్లలోని చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ సీనియర్ సిటిజన్లు, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, క్యూ లైన్లలో ఆరోగ్య సమస్యలు తలెత్తిన వారికి తక్షణ వైద్య సహాయం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. పాగాలంకరణ కార్యక్రమానికి దాదాపు 7 నుండి 8 వేల మంది భక్తులను అనుమతించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా శివదీక్షాపరులతో పాటు ఇతర భక్తులకు కూడా అవకాశమివ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. భక్తులందరూ శివనామ స్మరణతో, సమయపాలన పాటిస్తూ దర్శనం చేసుకుని నిండు ఆయురారోగ్యాలతో స్వగ్రామాలకు చేరుకోవాలని జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ఆకాంక్షించారు. శ్రీశైల క్షేత్రంలో ఒక్కరోజు నిద్రిస్తే అనేక యుగాల పుణ్యఫలం లభిస్తుందని విశ్వాసంతో దాదాపు 2.50 లక్షల మంది భక్తులు ప్రస్తుతం క్షేత్రంలో ఉన్నారని కలెక్టర్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 30 పడకల ఆసుపత్రి, 7 అత్యవసర అంబులెన్సులు విస్తృత తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలు, 30 నీటి ట్యాంకుల ద్వారా టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా అదేవిధంగా 46 కిలోమీటర్ల కాలినడక పాదయాత్ర మార్గంలో గుర్తించిన 13 ప్రదేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, టాయిలెట్లు, వైద్య సహాయం, చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులు ఎక్కువసేపు ఎండలో నిల్చోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూడా కలెక్టర్ సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# నంద్యాల అభివృద్ధియే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**సీసీ రోడ్డును పరిశీలించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్**






**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 15 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):**
నంద్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల స్థానిక శ్రీనివాస్ సెంటర్ నుండి సంజీవనగర్ గేట్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సి.సి. రోడ్డు పనులను మంత్రి ఫరూక్ స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతను తనిఖీ చేసి, అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపించకూడదని, ప్రజలకు సుదీర్ఘకాలం ఉపయోగపడేలా పటిష్టంగా నిర్మించాలన్నారు . శ్రీనివాస్ సెంటర్ – సంజీవనగర్ గేట్ మార్గం ఎంతో కీలకమైనదని, ఈ సి.సి. రోడ్డు పూర్తి కావడంతో వాహనదారుల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, 19 వార్డ్ టీడీపీ ఇంచార్జి షేక్ మొహమ్మద్ రఫీ (మున్నా), చంద్ర రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కాంట్రాక్టర్ పబ్బతి వేణు , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన మహానంది

## - ఉదయం మయూర వాహనంపై మహానందీశ్వర స్వామి

**- నంది వాహనంపై విహరించిన మహానందీశ్వరుడు**






**మహానంది, ఫిబ్రవరి 15,(రిపబ్లిక్ న్యూస్)**
మహాశివరాత్రి సందర్భంగా మహానంది క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ప్రాంగణాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

**నంది వాహనంపై విహరించిన మహానందీశ్వరుడు:**

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో కొలువైన మహానందీశ్వర దంపతులు రాత్రి నంది వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మయూర వాహనంపై కొలువై ఆలయ ప్రాకారాల్లో విహరించారు.

**శ్రీ మహానందీశ్వర స్వామికి మహా లింగోద్భవ రుద్రాభిషేకం:**

శ్రీ మహానందీశ్వర స్వామికి మహా లింగోద్భవ సమయంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని, పండితులు, అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ సమయంలో జరుగుతున్న అభిషేకం పూజల్లో అతిథులు పాల్గొన్నారు.

**భారీ పోలీసు బందోబస్తు:**

మహా శివరాత్రి సందర్భంగా మహానంది క్షేత్రంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ మందా జావళి ఎప్పటికప్పుడు ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు. ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 46 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు. 42 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నట్లు తెలిపారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి ప్రతి క్షణం పరిస్థితులపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు పరిశీలించారు.

# ఫిబ్రవరి 16న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**అర్జీలు ఆన్లైన్లో లో నమోదు చేసుకోవచ్చు -సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి, 15 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఫిబ్రవరి16న (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో ద్వారా కూడా సమర్పించవచ్చున్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# ఆలయ విమాన గోపురానికి ఘనంగా పాగాలంకరణ

## శివనామస్మరణతో మార్మోగిన శ్రీశైల మహాక్షేత్రం


**అశేష భక్తజన వాహిని మధ్య భక్తిశ్రద్ధలతో లింగోద్భవ మహన్యాస రుద్రాభిషేకం, పాగాలంకరణ**

**రమణీయం... కమనీయం... నయనానందకరంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం**





**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 15 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):**
శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మల్లికార్జున స్వామివారికి ఆలయ విమాన గోపురంపై పాగాలంకరణ ఘనంగా నిర్వహించారు. లింగోద్భవ సమయానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. చీరాల వాస్తవ్యులు పృథ్వి వెంకటేశ్వర్లు సంతతి పృథ్వి సుబ్బారావు భక్తిశ్రద్ధలతో 365 రోజుల పాటు ప్రతిరోజూ ఒక మూర చొప్పున నేత నేసి సిద్ధం చేసిన పాగాను స్వామివారికి సమర్పించారు. ఆలయ సాంప్రదాయ పద్ధతులనుసరించి సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ పాగాలంకరణ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఈ సందర్భంగా భక్తులు ఏకస్వరంతో శివనామస్మరణ చేస్తూ క్షేత్రాన్ని మార్మోగించారు. అనంతరం నాగలకట్ట సమీపంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రమణీయంగా, కమనీయంగా, నయనానందకరంగా జరిగిన ఈ కల్యాణ మహోత్సవాన్ని దర్శించేందుకు అశేష భక్తజన వాహిని తరలివచ్చింది. సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు భక్తులకు కన్నుల పండుగగా నిలిచాయి. ఈ ఉత్సవ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తిక్, దేవస్థానం బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com